ఉద్యానం.. అధ్వానం.!

పర్వరీష్ బాగ్ పార్క్



- తుప్పపట్టిన ఆటవస్తువులు.. మందుబాబుల ఆగడాలు
- పార్కు చుట్టూ మట్టికుప్పలు, చెత్తాచెదారం
- చెత్త డంపింగ్‌యార్డుగా మారిన పర్వరీష్ బాగ్ పార్కు



పార్కు వద్ద పేరుకుపోయిన మట్టికుప్పలు





ఫ్రీడమ్ పార్కు గేటుకు తాళం వేసిన దృశ్యం



కాచిగూడ: విరిగిన బెంచీలు, ఊయలలు, గడ్డి ఎండిపోయి పచ్చదనం కరువై పార్కులోని ప్రాంగణంలో ఎక్కడ పడితే అక్కడే పేరుకుపోయిన చెత్తాచెదారంతో అధ్వానంగా కనిపిస్తోంది. ఇదీ కాచిగూడలోని పర్వరీష్ బాగ్ పార్కు దుస్థితి. పర్వరీష్‌బాగ్ కాలనీ పరిసర ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా లక్షలాది రూపాయలు వెచ్చించి పార్కును అభివృద్ధి చేశారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పర్వరీష్‌బాగ్ పార్కును ఫ్రీడమ్ పార్కుగా గత సంవత్సరం తీర్చిదిద్దారు.

విరిగిపోయిన ఆట వస్తువులు..

అందమైన పచ్చిక బయళ్లు, చూడముచ్చటైన ల్యాండ్ స్కేపింగ్, విశాలమైన ప్రాంగణంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని రజలకు పంచిన పార్కు నేడు నిర్వహణ కరవై వెలవెలబోతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం, కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వెరసి సందర్శకులకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం కరవైపోతోంది. చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఊయలలు విరిగిపోవడంతో మూలన పడేశారు. అందే విధంగా సందర్శకులు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు విరిగిపోయాయి. జీహెచ్‌ఎంసీ ఉద్యానశాఖ అధికారుల పర్యవేక్షణ, నిర్లక్ష్యం ఫలితంగా పచ్చదనంతో కలకలలాడాల్సిన పార్కు ఎడారిగా మారింది.

కాలనీలో పార్కు ఉన్నా ఉపయోగపడకపోవడంతో అధికారుల తీరుపై కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పేరుకుపోయిన మట్టికుప్పలు..

పార్కును ప్రశాంతమైన, ఆహ్లాదకరంగా, మనశాంతిని పెంచే విధంగా ఉండాల్సిన పార్కు వద్ద, రహదారి వెంట వెళ్లే పాదచారులు మూత్ర విసర్జన చేస్తూ అక్కడి ప్రశాంతమైన వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. పార్కు ఫుట్‌పాత్‌పై చెత్తను, మట్టికుప్పలను డంపింగ్ చేస్తూ డంపింగ్ యార్డుగా మారుస్తున్నారు. పార్కు వద్ద రోడ్డుపై వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తూన్నారు. పార్కుకు అనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త పేరుకుపోయి ప్రమాదకరంగా మారింది. అయినా పట్టించుకునే వారే లేరని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

◆ కాలనీవాసులు కొందరు తమ ఇళ్లలోని గృహనిర్మాణ వ్యర్థాలు, మట్టికుప్పలను పార్కు ఫుట్‌పాత్‌పై వేస్తునానరు. దీంతో వ్యర్థాలు రోడ్డుపైకి చేరుతుంది. వాహనాల రాకపోకలతో దుమ్ము ధూళితో అధ్వానంగా మారింది. రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం శుభ్రం చేసి ఓ చోటికి చేర్చినా వాటిని తరలించకపోవడంతో సమస్య మళ్లీ మొదటికొస్తుంది. నెలలు కావస్తున్నా చెత్త తొలగించకపోవడంతో రోడ్లమీదకు వస్తుండడంతో జీహెచ్‌ఎంసీ సిబ్బందిపూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి చెత్త కుప్పలు తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అన్నీ చట్టవ్యతిరేక పనులే..

◆ ఎప్పుడూ చూసినా పార్కుకు తాళం వేసి ఉంటుంది. కాస్త సేదతీరడానికి రావాలనుకునే స్థానికులకు నిరాశ మిగిలిపోతోంది. పార్కు చుట్టూ చెత్తాచెదారంతో నిండిపోయి ఉంటుంది. కాస్త చీకటి పడగానే మద్యం ప్రియులు దర్శనమిస్తారు. రాత్రి సమయాల్లో ఇక్కడి పార్కు పరిసరాల్లో పెట్రోలింగ్ చేయాలని స్థానిక పోలీసులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు మరింత రెచ్చిపోతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పర్వా నహీ కర్తే అధికార్.!





పార్కు వద్ద ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

పట్టించుకోని అధికారులు..

◆ పార్కు విషయమై అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

25న రంగానగర్ యువజన సేవా సంఘం ఎన్నికలు

ముషీరాబాద్: రంగానగర్ యువజన సేవా సంఘం ఎన్నికలు ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు మల్లేష్, నర్సింగ్‌రావు, ఈశ్వర్, శంకర్ తెలిపారు. ఆదివారం రంగానగర్ సేవా సంఘం ఎన్నికలలో అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న వివిధ పార్టీల నాయకులు వై.శ్రీనివాస్‌రావు, సుక్కా నాగేష్, ఆర్.రవికుమార్‌లు సంఘం నాయకులకు తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలిపిస్తే స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నిత్యావసరాల వితరణ



ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోని పేదలను ఆదుకోవాలని మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో కార్మిక నేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌యాదవ్ వర్ధంతి సందర్భంగా అనాథాశ్రానికి నిత్యవసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగాల శ్రీకాంత్‌గౌడ్, అనిల్‌యాదవ్, మోహన్‌దాస్, రజనీ, ఇందిరాప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

శ్రీనీలకంఠి సంఘం నూతన కార్యవర్గం

కాచిగూడ: శ్రీనీలకంఠి సంఘం హైదరాబాద్ వార్షిక సర్వసభ్య సమావేశం నింబోలిఅడ్డలోని భావసార్ క్షత్రియ సమాజ్ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అఖిల భారత నీలకంఠి సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి శవ్వల్ శంకర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శ్రీనీలకంఠి సంఘం హైదరాబాద్ అధ్యక్షుడిగా వీరబత్తిని శంకర్, ప్రధానకార్యదర్శిగా అక్కల సుధకర్, కోశాధికారిగా బట్టు నాగరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా తుమ్మ హరికిషన్, నీలకంఠి శేషాంకమౌళి, గవ్వల శ్రీధర్, వీరబత్తిని కృష్ణ వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను సత్కరించి అభినందనలు తెలియజేశారు.

సన్మానం

నల్లకుంట: త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం, శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించినందుకు పంచశత వీణా గానరత్న పోపూరి శ్రీనివాసశర్మను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా మందిరంలో టీవీ దర్శక నిర్మాత ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతామూర్తి, ఆధ్యాత్మికవేత్తలు రామ్మోహన్‌రావు, కామేశ్వర్‌రావు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వర్ధమాన గాయిని యశస్విని, విద్యార్థులు హిరణ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్య ఉన్నతికి కొమర్రాజు లక్ష్మణరావు విశేష కృషి



కొమర్రాజు లక్ష్మణరావుకు నివాళులర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కళా జనార్దనామూర్తి

చిక్కడపల్లి: తెలుగు భాషా సాహిత్య ఉన్నతికి కొమర్రాజు లక్ష్మణరావు విశేష కృషి చేశారని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభ నిర్వహణలో కళాలలిత కళావేదికలో కొమర్రాజు లక్ష్మణరావు యాదిలో శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ తెలుగు సాహిత్య వికాసానికి ఆయన రచనలు దోహదం చేశాయన్నారు. ఆయన రాసిన విజ్ఞాన చంద్రిక పరిశోధనలకు కరదీపికగా నిలుస్తుందన్నారు. త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు జయరాములు, వేణుమాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్మి శతకం' గ్రంథావిష్కరణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: శ్రీరాగ రమ్య కల్చరల్, సోషల్ యాక్టివిటీస్ ఆర్గనైజేషన్ వార్షికోత్సవం ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హాస్య బ్రహ్మ డాక్టర్ శంకరనారాయణ రచించిన లక్ష్మి శతకం గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం డా. శంకరనారాయణ మాట్లాడుతూ... ఆరేళ్లుగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో శ్రీరాగ రమ్య సంస్థ ద్వారా అనేక కళా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇప్పటి వరకు 250కి పైగా కార్యక్రమాలు నిర్వహించారని అందులో తిరుపతి, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి, అహోబిలం వంటి పుణ్యక్షేత్రాలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాగ రమ్య వ్యవస్థాపక అధ్యక్షురాలు రమ్య, షిర్డీ సాయి డ్యాన్స్ అకాడమీ ప్రతినిధి అనిత, కూచిపూడి నృత్య గురువు హర్షిక, వివిద సంస్థల ప్రతినిధులు శ్రీదేవి, లతారావు, పావని ప్రియా, అపర్ణ, కృష్ణప్రియా, ఉమా లలిత, బిందు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర సదస్సులో పాల్గొన్న నాయకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూడావత్ రాంబాబు నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో లంబాడా హక్కుల పోరాట సమితి వర్కింగ్‌ప్రెసిడెంట్ సక్కునాయక్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పోరాట సమితి నూతన సంవత్సర కేలండర్‌ను రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ బెల్లయ్యనాయక్ ఆవిష్కరించారు. అనంతరం రాంబాబు నాయక్ మాట్లాడుతూ.. దేశంలో హిందీ తరువాత ఎక్కువ మంది మాట్లాడే భాష గోర్ బోలి భాష అని అన్నారు. ఈ భాషను భారత రాజ్యాంగంలో చేర్చాలని ఆయన కోరారు. అందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని సూచించారు. ఫిబ్రవరి 15వ తేదీన గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలన్నారు.

అదే విధంగా సెలవు దినంగా ప్రకటించి ఉత్సవాలకు జిల్లాకు కోటి రూపాయలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి భూక్యాకోటియా నాయక్, ఉపాధ్యక్షులు చిన్ని కృష్ణ, రమావత్ సక్కునాయక్, చెందర్‌నాయక్, అశోక్, రమేష్, బిక్షం, వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్‌గా నేతికార్ సురేష్‌లాల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అరెకటిక నాయకులు శాబాంకర్ దయానంద్ ఆదివారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన సురేష్‌లాల్‌ను పార్టీ అధిష్ఠానం గుర్తించి ఈ పదవీ ఇవ్వడం హర్షణీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో అరెకటికలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధన సంగీతోత్సవాలు





కీర్తనలు ఆలపిస్తున్న సుతీర్థ్, గానం చేస్తున్న ఆలిండా రేడియో కళాకారుడు డీవీ మోహన కృష్ణ

నల్లకుంట: శ్రీరామ గానసభ ఆధ్వర్యంలో న్యూ నల్లకుంటలోని న్యూ రామాలయం ప్రాంగణంలో ప్రారంభమైన సద్గురు త్యాగరాజస్వామి 56వ వార్షిక ఆరాధన సంగీతోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం దివంగత బాల మురళీకృష్ణ ప్రియ శిష్యుడు, ఆలిండియా రేడియో కళాకారుడు డీవీ. మోహన కృష్ణ, ఆర్. సుతీర్థ్ గానం ఆహుతులను ఆకట్టుకుంది. దీనికి వయోలిన్‌పై రాజశేఖర్, విజయ బాలాజీ మృదంగంపై కృష్ణ శ్రవణ్, పెరవలి జయభాస్కర్, ఘటంపై ఎం.చంద్రకాంత్ శర్మ వాద్య సహకారమందించారు. కేవీ.తిరుమల రావు, జ్యోతి, కూరగాయల చిరంజీవి, ధనలక్ష్మి దంపతుల సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామగాన సభ అధ్యక్షుడు జి. నాగరాజన్, కోశాధికారి పీవీ. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'మహిళలు ఎదిగినప్పుడే సమాజం బాగుంటుంది'



కుట్టు శిక్షణ, మగ్గం వర్క్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న రాజేందర్ పటేల్

కాచిగూడ: మహిళలు ఎదిగినప్పుడే కుటుంబం, సమాజం బాగుంటుందని హిందూ శ్మశానవాటిక ట్రస్ట్ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో హరాస్‌పెంటలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి కుట్టు శిక్షణ, మగ్గం వర్క్ ఉచిత శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలకు ఆదివారం ఆయన సర్టిఫికెట్స్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉచిత శిక్షణ, ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్ విగ్, సి.నందకిషోర్ యాదవ్, పి.విజయ్‌కుమార్, రతన్ విద్యాసాగర్, కృష్ణాగౌడ్, కె.సాయి గిరిధర్, సకోటే కుశాల్, కొండ శ్రీనివాస్‌రావు, బల్మూర్ రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో దరఖాస్తుల ఆహ్వానం

ముషీరాబాద్: ముషీరాబాద్ సెట్విన్ కేంద్రంలో వివిధ ఉపాధి రంగంలో పదో తరగతి పాస్, ఫెయిల్ అయిన వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు సెట్విన్ కేంద్రం ఇన్‌చార్జి సత్యవతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వల్పకాల వ్యవధిలో నామమాత్రపు ఫీజుతో కంప్యూటర్ బేసిక్స్, అకౌంట్ ప్యాకేజ్, ఎంఎస్ ఆఫీసు, హార్డ్‌వేర్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషన్, మొబైల్ సర్వీసింగ్, డీటీపీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ తదితర 24 రకాల కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం గుర్తింపు సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నం.91105 34518.

పద్మశాలీలు ఐక్యంగా ఉండాలి

చిక్కడపల్లి: అఖిల భారత పద్మశాలి మహిళా విభాగం రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను అధ్యక్షురాలు వనం దుశ్యంతల, ఉపాధ్యక్షురాలు పద్మ సూర్యప్రకాష్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు చిక్కడపల్లిలో మాట్లాడుతూ.. పద్మశాలీ ఐక్యంగా ఉంటే హక్కులు సాధించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి విశ్వరేఖ, అఖిల బారత అధ్యక్షులు కందకట్ల స్వామి, కార్యదర్శి వనం విశ్వనాథం పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాలలో రాణించాలి

కవాడిగూడ: యాదవ సమాజిక వర్గం విద్యా, వైద్యం, ఉపాధి, ఉద్యోగం, రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ముషీరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొల్ల కురుమలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి గొర్ల పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. యాదవుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నేతలు పాశం అనిల్ యాదవ్, సత్యనారాయణ యాదవ్, అశోక్, వెంకట్‌రమణ, శ్రీశైలం, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



శిరీష (ఫైల్)

నల్లకుంట: ఓ యువతి అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీసస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాలు.. ప్రైవేటు ఉద్యోగిణి కటిక జయమ్మ కుటుంబ సభ్యులతో కలిసి విద్యానగర్ దయానంద్‌నగర్‌లో నివాసం ఉంటోంది. ఈనెల 18న రాత్రి 9గంటల సమయంలో తండ్రి, సోదరి శిరీష(19)తో కలిసి భోజనాలు ముగించుకుని నిద్రించారు. మరుసటి రోజు తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో లేచి చూసిన జయమ్మకు ఇంట్లో సోదరి కనిపించలేదు. అన్ని చోట్ల విచారించినప్పటికీ సోదరి ఆచూకీ తెలియరాలేదు. ఆందోళన చెందిన అక్క జయమ్మ తమ సోదరి కనిపించడం లేదంటూ నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రమేష్ అనే వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

అంతర్జాతీయ పోటీల్లో మేఘన రాణించాలి



వీరమల్ల మేఘనను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. వీరమల్ల మేఘన దుబాయ్‌లో జరిగే అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికవ్వడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గాంధీనగర్‌లోని ఆమె నివాసానికి వెళ్లి ఆదివారం ఎమ్మెల్యే అభినందించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. చదువుతో విజ్ఞానాన్ని క్రీడలతో శరీర దారుఢ్యాన్ని పొందుతారని పేర్కొన్నారు. మేఘనాకు తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు. అంతర్జాతీయ కరాటే పోటీల్లో మేఘన రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేఘన తండ్రి వీరమల్ల శ్రీనివాస్, నేతలు రాకేష్‌కుమార్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి



కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని వినతి పత్రం అందజేస్తున్న మేకల రాములు యాదవ్

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో యాదవులకు అవకాశం కల్పించాలని అఖిల భారత యాదవ కుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ కోరారు. ఈ మేరకు ఆదివారం బర్కత్‌పురలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని ఆయన కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో 15శాతానికి పైగా ఉన్న యాదవులను గుర్తించి జనాభా ప్రాతిపదికన పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గ్రేటర్ అధ్యక్షుడు రవియాదవ్, దయాకర్‌యాదవ్, ప్రవీణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ఆశమ్మ కృషి మరువలేనిది



ఆశమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పూస రాజు, బాలకృష్ణ తదితరులు

ముషీరాబాద్: మహిళల సంక్షేమానికి ప్రధాని నరేంద్రమోదీ పెద్దపీట వేసి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు అన్నారు. ఆదివారం మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు ఆశమ్మ సంతాప సభను మహంకాళి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఎ.బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆశమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పూస రాజు మాట్లాడుతూ.. మహిళా మోర్చా నాయకురాలు ఆశమ్మ ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, బద్రి నారాయణ, వాసు, రాజశేఖర్, మణమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక ముగ్గులు



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ముగ్గులను పరిశీలిస్తున్న ఎమెల్యే ముఠా గోపాల్, సుదేష్

ముషీరాబాద్: మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక ముగ్గులు అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం పద్మశాలి సంఘం ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు అతినగరం సుదేష్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పోటాపోటీగా రంగు రంగుల ముగ్గులు, సామాజిక స్పృహతో వేసిన ముగ్గులు అందరిని ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముగ్గులను పరిశీలించి మాట్లాడారు. భావితరాలకు మన సంస్కృతిని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నగర నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌ను పద్మశాలి సంఘం అధ్యక్షులు సుదేష్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిటీ అధ్యక్షురాలు బోనం ఊర్మిళ, నాయకులు మంతన దశరథ్, తిరుపతి, నిర్మల, అరుణ, సతీష్, ఎయిర్‌టెల్ రాజు, గణేష్, బల్లా ప్రశాంత్, బన్నీ, నారాయణమూర్తి, చంద్రకళ, రూప, బొట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.